# సరళ

రచన:
శ్రీ ఎం. కృష్ణమూర్తి, పట్నాయిక్

ఆమె మా క్లాసులో చదువుతూన్నది. పేరు సరళా. ఎంత అందంగా ఉంటుంది! ఎంత చలాకీగా ఉంటుంది!

కళ్ళల్లో ఎప్పుడూ విద్యుల్లతలు కదులుతూంటాయి, పెదవులపై చిరునవ్వు తాండవిస్తూ ఉంటుంది.

చామన చాయ. విశాలమైన పెద్ద కళ్ళు. ఎప్పుడూ ఇటూ అటూ తిరుగుతూంటాయి. ఒక క్షణం కూడా స్థిమితంగా ఒక వైపు చూడలేదేమో!

నేను కొత్తగా ఎమ్. ఏ. పాసై ప్రొఫెసరుగా కాలేజీలో చేరాను. యువకుడుగా వున్న రోజులవి. ఉదయం అంతా బంగారుగాను, పగలు ప్రకాశంగాను, రాత్రి ఏదో అస్పష్టమగు ఆకర్షణీయంగాను ఉండేది.

సరళ క్లాసువాళ్ళకి నేను ఇంగ్లీషు చెప్తూన్నాను, ఆమె థర్డ్ ఇయర్ చదువుతూన్నది. రోజూ జిగేల్ మనే ఒక కొత్త చీరె, తళుక్కుమనే దుద్దులు, కిందుగా కత్తిరించిన జంపరు, టక టకలాడే జోళ్ళతో విద్యార్థుల హృదయాల్ని చీల్చి చెండాడుతూండేది. విద్యార్థులు లెక్చర్లు వినేబదులు ఆమెని చూడ్డానికి ఉబలాట పడేవాళ్ళు. కొందరికి ఆమెవల్ల కవిత్వం కూడా అబ్బింది.

అందమే రూపమై
ఇటు వచ్చెనా ?
అతివయే అందమునకు
రూపమిచ్చెనా ?
అతివ అందము చెప్ప
అలవౌన ఎవరికిని ?
శబ్దమే చాలదు !
అర్థమే కుదురదు !!

నేను ఇదంతా చూస్తూనే చూడనట్టు ఊరుకున్నాను. క్లాసులో ఆమె ఎప్పుడూ ఏదో నోటు చేసుకోలేదు. జంపరులో తగిలించుకున్న చిన్న పార్కరు పెన్ను బహుశా అందం కోసం కాబోలు పెట్టుకునేది.

ఆమె ప్రతి అవయంలోనూ యౌవనం చిందులు తొక్కుతూన్నది. ఆమెకి ఇంగ్లీషులో మంచి ప్రవేశం ఉన్నది. బాగా మాట్లాడుతుంది. రాస్తుంది కూడాను. అప్పుడప్పుడూ స్టాఫ్ రూమ్‌లోకూడా ఆమె ప్రశ్నకి వస్తూండేది. నేను క్లాసుకు వెళ్ళి ఆమెని చూడకుండా ఉండడం మంచిదని అనుకునేవాణ్ణి. కారణం, ఆమెని ఒక మారు చూస్తే మరోమారు మరోమారు చూడాలనిపిస్తుంది.

ఒకరోజు క్లాసులో పాఠం చెప్తూ యథాలాభంగా చూసేసరికి మొదటి బెంచీల్లోని విద్యార్థులు అట్టే సరళ వైపు చూస్తూన్నారు. స్థిమితంగా కూచోలేక కోతుల్లా అవుతూన్నారు. ఓరగా నేను ఒకమారు ఆమెవైపు చూశాను. ఆమె వంగి దీక్షగా ఏదో పుస్తకాన్ని చూస్తోంది. కిందుగా కత్తిరించిన ఆమె జంపరు తొలగి ఊగులాడుతూన్నది.

లోపలినుంచి......

ఆమె బ్రేసరి కూడా తొడుక్కోలేదు. హఠాత్తుగ నేను పాఠం చెప్పడం ఆపేశాను-ఆమె తలెత్తింది-నేను ఆమెవైపు చూస్తూండడం చూసింది. ఆమెకళ్లు ఒకమారు మెరిశాయి. నేను మళ్ళా పాఠం చెప్పడం మొదలెట్టాను.

నాకు సిగ్గుతో చెమటలు పోసేశాయి. ఇదంతా ఒక సెకండులో గడిచి పోయింది. ఒకక్షణం తరవాత క్లాసు వైపు చూశాను విద్యార్థులు నన్ను పసికట్టేరేమోనని. ఎలాగో ఒకలాగ పీరియడు అయిపోయింది. క్లాసునుంచి బయటికి వచ్చేస్తూండగా ఎవరో నన్ను తోసుకుని వెళ్ళి పోయారు. ఆమె ఎవరో కాదు. సరళే!

మర్నాడు క్లాసులోకి వెళ్ళేసరికి నిజంగా నా కాళ్ళు వణక సాగాయి. ప్రవేశిస్తూనే చూసేసరికి సరళ నన్ను చూసి నవ్వుతూన్నది. ఆ నవ్వులో ఏదో గూఢార్థం కనబడుతూన్నది. తొట్రుపాటుతో చటుక్కున కుర్చీలో కూలబడి పోయాను.

ఎంతో కష్టం మీద గొంతుక సవరించుకుని ఒక వ్యాసం రాయమని విద్యార్థులకి చెప్పాను. పాఠం చెప్పడం అసాధ్యం అయిపోయింది మరి!

కొంచెం సేపు పోయాక మెల్లిగా చూశాను. సరళ దీక్షగా రాస్తూన్నది. ఉండి ఉండి అలవాటు చొప్పున ఆమె పెదవులపైన చిరునవ్వు తాండవిస్తూన్నది.

నా తలలో ఆలోచనలు పరుగెత్తాయి. సరళ ఎంత అందగత్తె! ఎంత అప్ టు డేట్ గర్ల్! ఎంత ధారాళంగా ఇంగ్లీషు మాట్లాడుతుంది! పైగా గొప్ప ఇంటి అమ్మాయిలా ఉన్నది. కొత్త కొత్త చీరెలూ, నిగనిగలాడే జోళ్లూ, కాలేజీకి వచ్చీ పోయేందుకు బండీ అన్నీ ఉన్నాయి. ఒకవేళ...ఓహో! ఇలా ఎక్కడైనా జరుగుతుందా? ఒక బీద ప్రొఫెసరుని...అసంభవం! కాని,

ఇలాంటివి చాలా జరిగాయి. చాలమంది ప్రొఫెసర్లు కాలేజీ విద్యార్థినుల్ని పెళ్ళిళ్ళు చేసుకున్నారు. కాని, సరళ విషయం...? ఎంత కళకళ లాడే ముఖం...! ఆమె ఇంకా రాస్తున్నది. హఠాత్తుగ ఆమె వ్యాసాన్ని చూసేందుకు నాకు ఆరాటం కలిగింది. ఎలా రాసిందో!

'కాపీలు ఇలా ఇవ్వండి. ఇంటి దగ్గిర దిద్ది ఇస్తాను.' అన్నాను.

సరళ నావైపు ఒకమారు చూసింది. చూసి ఆ వెంటనే మళ్ళా వ్రాతలో మునిగిపోయింది,

సాయంత్రం సరళ కాపీని చూశాను. బాగానే రాసింది. ఒక పేజీలో...చూశాను! గుండె ఆగిపోయినంత పనైంది. ఎలాగో లేచి గబుక్కున తలుపులు మూసేసి వచ్చాను. ఆ కాపీలో నా పేరున ఒక ఉత్తరం ఉన్నది!

ఉత్తరం చదివాను. ఒక్కొక్క పదమూ చదువుతూంటే నమ్మలేకుండా ఉన్నాను. నిజంగా ఆ ఉత్తరం నాకే రాసి ఉన్నది. నిజంగా సరళ...? ఎన్నిమార్లు చదివినా తనివి తీరలేదు. సరళ ఉత్తరం వ్రాసింది. ఇప్పటికీ అది నాదగ్గిర ఉన్నది.

డియర్ ప్రొఫెసర్,

మీకు ఉత్తరం ఎందుకు రాస్తూన్నాను? బహుశా మీరు తెలుసుకోలేరనుకుంటాను. మీకు ఒక విషయం అడగాలని ఉన్నది. మీరు క్లాసులో పాఠాలు చెప్తూ నన్ను ఒకమారైనా చూడరేం? నన్ను చూస్తే భయం వేస్తోందా?

ఇకనైనా నన్ను చూడకపోతే నిజంగా నాకు కోపం వస్తుంది. పోతే, ఈ ఉత్తరం సంగతి? ఇది నా వెఱ్ఱితనానికి నిదర్శనం! వెఱ్ఱితనానికి జడుస్తారా?

మీ-సరళ.

మర్నాడు నేను హుషారుగా ఉత్సాహంగా క్లాసుకి వెళ్ళాను. సరళ మౌనంగా కూచుని ఉన్నది. ఏదో ప్రశ్నిస్తూన్నట్టు నా వైపు చూసింది. ఆనాడు షేక్స్పియర్ పాఠం చాలా బాగా చెప్పాను. చాలా సార్లు సరళ నా వైపు చూసింది. అవే లేడి చూపులు, చిరునవ్వులూను!

తరవాత? మళ్ళా ఒక లేఖ వచ్చింది. నా మౌనానికి ఆగ్రహిస్తూ రాసింది. అప్పటినుంచి నేను ఉత్తరాలు రాయసాగాను. అప్పుడప్పుడూ ఇద్దరూ కలుసుకుని మాట్లాడుకోడం కూడా జరగసాగింది. కాని, మనస్సుని కలవరపరిచే ఆ మాటల్ని మళ్ళా తవ్వడం ఎందుకు అండి?

నాకు ఆ రాత్రులు నవ్వుతూ, దినాలు కేరింతాలు కొడుతూ గడిచిపోసాగాయి. సరళ ప్రేమలో నిలువునా మునిగిపోయాను.

వేసవి సెలవలు వస్తూన్నాయి. ధైర్యం చేసి సరళని అడగాలనుకున్నాను ఎప్పుడు...? ఇప్పటికీ ఆనాటి విషయం నా కళ్ళకు కడుతూన్నది. ఆ రోజు సినిమాకి సరళని తీసుకెళ్ళి...అంతా...అనుకుని కాలేజీకి వెళ్ళాను.

కాని, కాలేజీలో సరళ లేదు. సెలవు తీసుకుందని తెలిసింది. ఏమిటి చేయాలో తోచలేదు. ఒకరోజు, సరళ ఉదకమండలం తమవాళ్ళతో కలిసి వెళ్ళిందని తెలిసింది. వెంటనే అక్కడికి వెళ్ళాలనుకుని పెట్టె బేడా సర్దుకున్నాను, ఉత్తరమైనా రాయలేదేమని అడగాలనుకున్నాను. తరవాత ఆమె ఎపుడు ఒప్పుకుంటే...

ఉదకమండలం వెళ్ళి సరళని కలుసుకొన్నాను. నన్ను చూడగానే కిల కిలా నవ్వింది. ఎన్నో కబుర్లు చెప్పుకొన్నాము. ఛలోక్తులు, హాస్యాలు ఆడుకొన్నాము. కాని, నేను గంభీరముద్ర వహించడానికి ప్రయత్నించాను.

'సరళా! నిన్నొక విషయం అడగాలి!' అన్నాను.

'మరో రోజు అడగండి. ఇవ్వాల్టికి ఇది తీసుకుని కాలక్షేపం చెయ్యండి! నవ్వుతూ అందామె.

నేను సంతోషంతో ఒక పార్శిలుని తీసుకుని ఇంటికి వచ్చేశాను. పార్శిలు విప్పి చూశాను. నిలువునా నీరైపోయాను!

అందులో ఒక పుస్తకం ఉన్నది. "Men in Love and their behaviour" (ప్రేమోన్మాదులగు పురుషులూ, వారి ప్రవర్తనా) రచయిత్రి సరళ! అందులో ఒక ప్రకరణ ప్రొఫెసర్లమీద ఉన్నది. నామీద కూడా ఉన్నది! ఒక్క పేరు మాత్రం లేదు. గొప్ప వ్యంగంగా రాసింది. నా చేతిలోంచి పుస్తకం జారిపోయింది. తల పట్టుకుని కూర్చుండిపోయాను.

తరవాత సరళని మళ్ళా ఎప్పుడూ కలుసుకోలేదు - కలుసుకోనేలేదు!

*